## క్లుప్తంగా

### 2కే రన్‌ను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వరంగల్ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం నిర్వహించనున్న తెలంగాణ 2కే రన్‌ను విజయవంతం చేయాలని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు పోచమ్మమైదాన్ నుంచి రన్ ప్రారంభమవుతుందని తెలిపారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, పోలీస్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు మట్టెవాడ – 87126 85005, మిల్స్‌కాలనీ – 87126 5006, ఇంతేజార్‌గంజ్ – 87126 5007 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### చీఫ్ విప్‌ను కలిసిన మాల కులస్తులు



కాజీపేట: కాజీపేట పట్టణంలోని బీఆర్ఎస్ నూతన పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో మాల భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతుండడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు మర్యాల కృష్ణ, అంకేశ్వరపు రాంచందర్, సీహెచ్.కొమ్మాలు, మేదరి సారంపాణి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తా సమీపంలోని పింజర్లవీధిలో గల జోయా లుక్కాస్ జ్యువెల్లరీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జూన్ 14వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శిబిరంలో జోయాలుక్కాస్‌కు చెందిన 30మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఎంజీఎం రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో జోయాలుక్కాస్ మేనేజర్ మింటో డోమినిక్, అసిస్టెంట్ మేనేజర్ డోబిలా వినయ్, సంతోష్, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మున్నూరుకాపు సంఘం డివిజన్ కమిటీ ఎన్నిక



వీరస్వామి, అధ్యక్షుడు



లక్ష్మణ్, కార్యదర్శి

హన్మకొండ: మున్నూరు కాపు సంఘం 30వ డివిజన్ కమిటీని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దాస్యం వినయ్‌భాస్కర్, గౌరవ ఉపాధ్యక్షుడిగా రావుల కిషన్, అధ్యక్షుడిగా బోనాల వీరస్వామి, ఉపాధ్యక్షుడిగా పోలు మల్లికార్జున్, కోరబోయిన విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జూకంటి లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా తోట తిరుమల్, కొమురవెల్లి శ్రీనివాస్, కార్యదర్శులుగా దేవేందర్, కాసర్ల దుర్గాప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా తోట కుమారస్వామి, గోలి శ్రీనివాస్, కోశాధికారిగా మనపల్లి శ్యామ్ ఎన్నికయ్యారని రవికుమార్ వివరించారు. గౌరవ సలహాదారులుగా డాక్టర్ అప్పల సుధాకర్, సుంకరి మల్లయ్య, నరెడ్ల కోటయ్య, మెట్టు మల్లికార్జున్, గందె కృష్ణ, బొల్లం వెంకటేశ్వర్లు, మాదాసు మొగులయ్య, సుంకరి రాఘవేందర్, మిద్దెల బాబు, కర్రు దశరథ్ కుమార్, డాక్టర్ పవన్ ఎన్నికయ్యారు.

### బాధితులకు పరామర్శ



ఖిలా వరంగల్: వరంగల్ తూర్పుకోటకు చెందిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు, ఆటో డ్రైవర్ మేడుదల కుమార్‌యాదవ్ శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, టీపీసీసీ కోఆర్డినేటర్ నల్గొండ రమేష్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు బోయిని దూడయ్యలతో కలిసి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆదివారం పరామర్శించారు. దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వీరన్న, రవీందర్, సాజీద్, యాకూబ్, ముక్కాబీర్, దాసి రాజేష్, అరవింద్, సంపత్, కుమార్, ఏసీరెడ్డి ప్రభాకర్, భూషణ్, ప్రతాప్, రఘు, జగన్ పాల్గొన్నారు.

# ఏడేళ్లుగా నిరీక్షణ!

- ప్రారంభోత్సవానికి నోచుకోని ఎంఈఓ కార్యాలయం
- నిరుపయోగంగా భవనం



కాజీపేటలోని ఎంఈఓ కార్యాలయ భవనం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీ సమీపంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మండల విద్యావనరుల కేంద్రం ఏడేళ్లుగా ప్రారంభోత్సవానికి నోచుకోకుండా నిరుపయోగంగా ఉంటోంది. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పడిన జిల్లాలు, మండలాల్లో భాగంగా కాజీపేట మండలానికి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఏడు సంవత్సరాల క్రితం మంజూరైంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ రూ.10 లక్షల నిధులను మంజూరు చేయించగా పనులను పూర్తి చేశారు. ఎంఈఓతో పాటు రిసోర్స్ పర్సన్లు, మండలంలోని ఉపాధ్యాయులు అవసరమైనప్పుడు సమావేశాలు జరుపుకునేలా భవనం నిర్మించారు. కాజీపేట మండలానికి రెగ్యులర్ ఎంఈఓ లేని కారణంగా భవనం నిరుపయోగంగా మారింది. కాజీపేట మండలానికి ఇన్‌చార్జ్‌గా హనుమకొండ ఎంఈఓ కొనసాగుతున్నారు. శాశ్వతంగా ఎంఈఓ పోస్టు మంజూరు చేస్తే తప్ప ఈ భవనం ప్రారంభానికి నోచుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఎంఈఓను కేటాయించి భవన ప్రారంభోత్సవానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## ప్రభుత్వ గురుకులాల్లో చేర్పించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

న్యూశాయంపేట: కార్పొరేట్ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంగ్లిష్ మీడియం గురుకులాలను పేద మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ నగరంలోని 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజ్ కుమార్ కోరారు. డివిజన్ పరిధిలోని మగ్దుం మొహియొద్దీన్ కాలనీలో తెలంగాణ మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ(టెమ్రిస్) వరంగల్ కౌన్సిలర్ సర్వర్ మొహియొద్దీన్‌తో కలిసి సంబంధిత కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సుశిక్షితులైన అధ్యాపకులు, ఉపాధ్యాయులు గురుకులాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ఉజ్వల భవిష్యత్ కోసం పిల్లలను గురుకులాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో రంగశాయిపేట శివారు వరంగల్ (బీ–1) గురుకులం అధ్యాపకులు, హనుమకొండ గురుకులం స్టాఫ్‌నర్స్, మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల సంక్షేమానికి సర్కారు పెద్దపీట

హన్మకొండ: దివ్యాంగుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలంగాణ జాగృతి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు లింగుదారి రాజేశ్వర్‌రావు అన్నారు. దివ్యాంగులకు అదనంగా రూ.వేయి పింఛన్ పెంచిన సందర్భంగా హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్ ఎదుట కేసీఆర్ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తోందని గుర్తుచేశారు. 'దివ్యాంగుల బంధు' కూడా అమలు చేసి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి వికలాంగుల విభాగం నాయకులు నెక్కొండ కిషన్, నడిపల్లి శ్రీధర్‌రావు, వెన్న కోటేశ్వరరావు, రామస్వామి, విద్యాసాగర్, పేనాల మల్లికార్జున్, ఈదునూరి వెంకటేశ్వర్లు, సముద్రాల నవీన్, ఎ.కృష్ణ, ఎ.విజయభాస్కర్, నరేష్, డెక్క విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### వాగ్దేవిలో గ్రూప్-1 ప్రిలిమ్స్



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్

మామునూరు: మామునూరు పోలీసు స్టేషన్ పరిధిలోని బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలో గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జరిగింది. మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణవేణి, రాకేష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మడికొండలోని మాస్టర్‌జీ హైస్కూల్‌లో..



పాఠశాల గేట్ వద్ద అభ్యర్థులు

మడికొండ: మడికొండలోని మాస్టర్‌జీ హైస్కూల్‌లో ఆదివారం గ్రూప్ –1 పరీక్ష జరిగింది. ఈ సెంటర్‌లో 240మంది అభ్యర్థులకు 144మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ దయానందకాలనీలోని వాణినికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన 1980 – 1981వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం హనుమకొండలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారందరు ఒకచోట చేరి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, శరత్, పీటీ ప్రకాశ్, పూర్వ విద్యార్థులు వీరగోని రమేష్ గౌడ్, విద్యాధర్, విల్లా రాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్యులు, అనాథలను ఆదుకోవాలి



బలగం నటులను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా: ఆపదలో ఉన్న అభాగ్యులు, అనాథలను ఆదుకోవాలని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ప్రెసిడెంట్ తోట నరసయ్య లింగం సూచించారు. వరంగల్ పిన్నావారి వీధిలోని వాసవి భవన్‌లో క్లబ్ రీజియన్ –4 అధ్యక్షుడు వల్లాల పృథ్వీరాజ్ అధ్యక్షతన రీజియన్ మీట్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాతూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడంలో క్లబ్‌లు ముందంజలో ఉండాలని కోరారు. కవులు, కళాకారులు, పేదలు, విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. పేద నిరుద్యోగి గంగిశెట్టి శ్రీనివాస్‌కు రూ.20 వేల వడ్డీలేని రుణం అందజేశారు. బలగం సినిమాలోని జీవీ.బాబు రావు, వేముల ప్రభాకర్‌ను సన్మానించారు. ఈనెల 24, 25వ తేదీల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రీజియన్ చైర్మన్ డాక్టర్ పృథ్వీరాజ్ రాజు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గుండా సంతోష్, ఎలిశాల ఆనంద్, సత్యనారాయణ రావు, గుంటూరు వెంకటనారాయణ, పుల్లూర్ కిషోర్, వల్లా శైలజ, బొడ్డ మోహన్, వాసవి క్లబ్ వరంగల్, వాసవి క్లబ్ ప్రతాపరుద్ర, వాసవి క్లబ్ వనిత, వాసవి క్లబ్ అభ్యుదయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలన



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రదీప్‌రావు

కరీమాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలన కొనసాగుతోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆరోపించారు. 40వ డివిజన్ ఉర్సు దర్గ, చెట్లగడ్డ ప్రాంతంలో గడపగడపకు బీజేపీ.. ప్రతీ గుండెకు బీజేపీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పట్ల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. అభివృద్ధిలో పాలకులు విఫలమయ్యారని ఎద్దేవాచేశారు. అబద్ధపు మాటలు, వాగ్దానాలు చేసి రెండవసారి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. నగరంలో భూకబ్జాలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, ప్రదీప్‌రావు సమక్షంలో పలువురు నాయకులు బీజేపీలో చేరగా వారిని ఆహ్వానించారు.

## 'ప్రజాగర్జన'కు తరలిన సీపీఐ శ్రేణులు



వరంగల్ రైల్వే స్టేషన్‌లో సీపీఐ నాయకులు



మడికొండ: తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

కాశిబుగ్గ: ప్రజా సమస్యలపై కొత్తగూడెంలోని సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బయలుదేరి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జనసేవాదల్ కన్వీనర్ పంజాల రమేష్, వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు మేకల రవి, కర్రె భిక్షపతి తదితరులు ఉన్నారు.

### మడికొండ నుంచి..

మడికొండ: కొత్తగూడెంలోని ప్రజాగర్జన మహాసభకు కాజీపేట మండలం మడికొండ, రాంపూర్ గ్రామాల నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు రైలులో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి మాలోతు శంకర్, సుమన్, రాజేశ్వరి, స్వామి, రాజమణి, కనకలక్ష్మి, కొట్టపాక రవి, మాధవి, రాజమణి, రజిత, పూర్ణచందర్, రవీందర్, కుమార్, దీన, ఐలయ్య ఉన్నారు.

## తిలక్‌రోడ్డులో పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



సాక్షి స్పందన

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ తిలక్‌రోడ్డులో పైపులైన్ లీకేజీలకు మున్సిపల్ అధికారులు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. 'పైపులైన్ లీకేజీలతో తాగునీరు వృథా' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం కథనం ప్రచురితమైంది. దానికి స్పందించిన అధికారులు.. జేసీబీ సాయంతో రోడ్డును తవ్వి లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. త్వరగా పనులు పూర్తిచేసి తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## పల్లె రవికుమార్ గౌడ్‌కు సన్మానం



రవికుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

హన్మకొండ: తెలంగాణ కల్లు గీత పారిశ్రామిక, ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్‌ను తెలంగాణ గౌడ సంఘం నాయకులు కలిశారు. హనుమకొండ నక్కలగుట్ట హరిత కాకతీయ హోటల్‌లో పల్లె రవికుమార్ గౌడ్‌ను తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నకిరకంటి మోహన్ గౌడ్, నాయకుడు మోహన్ గౌడ్ ఆదివారం కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## మైనారిటీ గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు

న్యూశాయంపేట: విద్యార్థుల సృజనాత్మకతను పెంచేందుకు రాష్ట్ర ఇన్నోవేషన్ ఇంక్విలాబ్ ఫౌండేషన్, యూనిసెఫ్, తెలంగాణ విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ తుదిదశ రాష్ట్రస్థాయి పోటీలకు హనుమకొండ జిల్లా పరిధిలోని ములుగురోడ్డు పెద్దమ్మగడ్డ వద్ద గల హనుమకొండ (బీ–1) ఒకేషనల్ మైనారిటీ గురుకులం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ జంగా సతీష్ ఆదివారం వివరాలు వెల్లడించారు. గురుకులానికి చెందిన సాయిప్రజ్వల్, ఇర్ఫాన్ అక్మల్, అబ్దుల్ సమీ, యాజిలాని విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో రూపొందించిన ఎలిఫెంట్ లెగ్స్ అంశం రాష్ట్రస్థాయి తుది పోటీలకు ఎంపికైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి వందల ఆలోచనలు రాగా తుది పోటీకి 70 మంది విద్యార్థులను ఎంపిక చేశారని వివరించారు. తుది పోటీలు హైదరాబాద్‌లో ఈనెల 22, 23వ తేదీల్లో జరుగుతాయని తెలిపారు. సైనికులు విపత్తుల్లో ఉన్నపుడు ఎలిఫెంట్ లెగ్స్ ద్వారా వారి సమాచారం తోటి బృందానికి, పైఅధికారులకు అందుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల బృందానికి మెంటార్లుగా ఉపాధ్యాయులు పి.మూర్తి, వనితలతో పాటు అధ్యాపకుడు కె.సందీప్ వ్యవహరిస్తారని తెలిపారు.

## చదువులోనూ ఆరెలు ముందుండాలి



విద్యార్థులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: చదువులోనూ ఆరె కులస్తులు ముందుండాలని ఆరె సంఘం హనుమకొండ జిల్లా ముఖ్య సలహాదారులు పేర్వాల లింగమూర్తి, కుడ్ల మనోహర్ రావు, ఆరెకుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోటె చిరంజీవి సూచించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్‌లో అధిక మార్కులు సాధించిన ఆరె కుల విద్యార్థుల సన్మాన కార్యక్రమాన్ని హనుమకొండ బాలసముద్రంలోని ఆరెకుల సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరె కులస్తుల సర్వతో ముఖాభివృద్ధికి సంఘం పనిచేస్తోందని వివరించారు. విద్యార్థులు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆరె కుల సంఘం హనుమకొండ మండల అధ్యక్షుడు శివాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు కుసుంబ శ్రీనివాస్, నాయకులు వాడికారి రాజు, కొల్లూరి రవీందర్‌రావు, అంబిరిపురి నర్సింగరావు, సుధాకర్, లోనె దీపక్, హింగే భాస్కర్, వాడికారి లక్ష్మణరావు, పేర్వారం విజయలక్ష్మి, హింగే మనోహర్ రావు, పేర్వారం శంకర్ రావు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వేలంపాటలను అడ్డుకుంటాం..



సమావేశంలో ఓసిటీ జనరల్ కౌన్సిల్ సభ్యులు

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్ ఓసిటీలో ఈనెల 14, 15వ తేదీల్లో జరగనున్న కుడా ప్లాట్ల వేలంపాటలను అడ్డుకుంటామని ఓసిటీ సాధారణ సభ్యులు తీర్మానించారు. ఈమేరకు ఓ సిటీ క్లబ్ హౌస్‌లో ఉపాధ్యక్షుడు శంకర్‌రావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓసిటీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కుడా అధికారులు హామీ ఇచ్చి వేలంలో ప్లాట్లు అమ్ముకున్నారని అన్నారు. ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, రాఘవరావు, అజయ్‌బాబు, లక్ష్మి, నర్సయ్య, ఓసిటీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'వాగ్దేవి'లో మెగా జాబ్‌మేళా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అభినవ్‌భాస్కర్, వాకర్స్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

హన్మకొండ చౌరస్తా: మాజీ మంత్రి, దివంగత ప్రణయ్‌భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ కోరారు. ఈమేరకు జాబ్‌మేళాకు సంబంధించిన కరపత్రాలను హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంఖ్యలో వివిధ కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు. పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తక్కళ్లపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ సంఘం బాధ్యులు పరకాల కుమారస్వామి, బొజ్జ చంద్రమౌళి, బూర గాంధీ పాల్గొన్నారు.

### నేడు మెగా జాబ్ మేళా

నయీంనగర్: నగరంలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు దాస్యం ప్రణయ్‌భాస్కర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ పిన్నింటి విజయ్‌కుమార్ తెలిపారు. హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రేటర్ 60వ డివిజన్ కార్పొరేటర్, దాస్యం ఫౌండేషన్ చైర్మన్ దాస్యం అభినవ్‌భాస్కర్ కృషితో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐటీ, ఫార్మ, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటోమొబైల్ తదితర కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొని సుమారు ఐదు వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఫౌండేషన్ బాధ్యులు రోకుల సతీష్, ఎతిరాజుల నరేష్, నక్క వివేక్, శేఖర్, సోను తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



మృతుడు

కాశిబుగ్గ: రైలుకింద పడి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ వెంకటేశ్వర కాలనీకి చెందిన బేతి రవీందర్‌రెడ్డి (55)ని అతని భార్య, కుమారుడు విడిచిపెట్టి వెళ్లిపోయారు. దాంతో హనుమకొండలోని లింగాల కేదారి ఫుడ్ కోర్టులో వంట మాస్టర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసైన రవీందర్ రెడ్డి.. అనారోగ్యం, ఆర్థికపరమైన సమస్యలతో జీవితంపై విరక్తి చెంది వరంగల్ – కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య అండర్‌బ్రిడ్జి సమీపంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యకు శుక్రవారం ప్రయత్నించగా తీవ్రగాయాలతో ట్రాక్ పక్కన పడి ఉన్నాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవా రు జామున మృతి రవీందర్‌రెడ్డి చెందాడు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతుడి మేనల్లుడు రాజిరెడ్డికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

### భవనం పైనుంచి పడి కార్మికుడికి గాయాలు

ఖిలా వరంగల్: నిర్మాణంలో ఉన్న భవనం పైఅంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన కార్మికుడికి తీవ్రగాయలయ్యాయి. ఈఘటన ఆదివారం వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. పాలకుర్తికి చెందిన జలగం రాజు తన భార్య పిల్లలతో కలిసి నగరంలోని వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలనగర్‌కు ఏడాది క్రితం వలస వచ్చాడు. భవన నిర్మాణానికి నీళ్లు కొట్టేందుకు దంపతులిద్దరు పని కుదుర్చుకున్నారు. రోజువారీగా ఆదివారం మధ్యాహ్నం భవనం పైఅంతస్తులో నిర్మాణానికి నీళ్లు కొడుతుండగా ప్రమాదవశాత్తు అక్కడి నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన భవన నిర్మాణ కార్మికులు.. క్షతగాత్రుడిని హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.